క్లుప్తంగా

కాకాణితో ఆదాల భేటీ



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. డైకస్‌రోడ్డులోని కాకాణి నివాసంలో కలిసిన వీరు వివిధ అంశాలపై చర్చించారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు భరోసాగా ఉండేందుకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేత మలిరెడ్డి కోటారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసునాయుడు, ఎమ్మెస్సెమ్‌ఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, మొయిద్దీన్, కొండేటి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



చంద్రశేఖర్

నెల్లూరు సిటీ : నగరంలోని రంగనాయకులపేట గొళ్లవీధిలో ఉంటున్న గోగుల చంద్రశేఖర్ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబసభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు 87906 71202 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్కిల్ సెన్సెస్‌పై శిక్షణ



నెల్లూరు(బారకాసు) : నగరపాలక కార్యాలయంలో వార్డు సచివాలయాల వెల్ఫేర్ కార్యదర్శులకు స్కిల్ సెన్సెస్ యాప్‌పై శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. అదనపు కమిషనర్ నందన్ పలు సూచనలు చేశారు. యాప్‌లో వివరాల నమోదుపై అవగాహన కల్పించారు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

నెల్లూరు సిటీ : నగరంలోని మినీ బైపాస్‌రోడ్డులో అనీల్ గార్డెన్స్‌కు సమీపంలో ఓ కారు కల్వర్టులోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతిదీవెన బకాయిలను విడుదల చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు కోరారు. ఈ మేరకు చలో కలెక్టరేట్‌ను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థి సంఘ నేతలు.. పోలీసుల మధ్య కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం డీఆర్వో ఉదయభాస్కర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, శ్రీహర్ష మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చిన అంశాన్ని గుర్తుచేశారు. ఎస్‌ఎఫ్‌ఐ టౌన్ సెక్రటరీ చరణ్, జీవన్, సుమన్, చందు, సంతోష్, మధు, విష్ణు, యశ్వంత్, పవన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయండి

నెల్లూరు(దర్గామిట్ట): మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని శుక్రవారం సమర్పించారు. ఎంటీఎఫ్ రాష్ట్ర నేతలు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, వెంగళరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ధనరాజ్, నగర బాధ్యులు మాల్యాద్రి, రహీం, ఖాజారహంతుల్లా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ మైదానంలో కార్తీక మాస లక్ష దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు విశేషంగా తరలివచ్చి దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు సాంస్కృతిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

ఆధ్యాత్మిక ప్రయాణం

- కార్తీక మాసం నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు



నెల్లూరు సిటీ : ఏటా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది అనేక ఆధ్యాత్మిక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. భక్తులకు అన్నివిధాలా సౌకర్యాలు కల్పించి టూర్ ప్యాకేజీలను రూపొందించారు. నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి వివిధ సమయాల్లో శబరమలైతో పాటు ప్రముఖ శైవక్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలం వెళ్లేందుకు స్పెషల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

శబరమలైకు..

అయ్యప్పస్వామి భక్తుల కోసం శబరమలైకు ఐదు రోజులకు రాను, పోను ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీకి రూ.4 వేలు, అల్ట్రా డీలక్స్‌కు రూ.3900, ఎక్స్‌ప్రెస్‌కు రూ.3300లుగా చార్జి నిర్ణయించారు. అయ్యప్ప భక్తులు కోరుకున్న మార్గంలో పుణ్యక్షేత్రాలు దర్శించుకునే విధంగా మరో ప్యాకేజీని నిర్ణయించారు. సూపర్ లగ్జరీ బస్సులకు ఒక కిలోమీటర్‌కు రూ.57, అల్ట్రా డీలక్స్‌కు రూ.61, ఎక్స్‌ప్రెస్‌కు రూ.62, అల్ట్రా పల్లె వెలుగుకు రూ.62 చొప్పున చార్జీలు ఉంటాయి. రోజుకు 420 కిలోమీటర్ల పరిమితి ఉంటుంది. శబరిమలై వెళ్లే మార్గంలో కాణిపాకం, భవాని, ఎరిమేలి, పంబ తిరుగు ప్రయాణంలో కుర్తాళం, మధురై, చెన్నై, మేల్ మరువత్తూర్ మీదుగా వస్తుంది. బస్సులు బయలుదేరు తేదీలు నవంబరు 17, 18, 20, 22, 25, 26, 28వ తేదీలతో పాటు డిసెంబరు నెలలో 3, 4, 6, 10, 11, 13, 17, 18, 20, 22, 25, 28 జనవరిలో 3, 5, 7వ తేదీల్లో బస్సులు నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ నుంచి ఉదయం 10 గంటల నుంచి బయలుదేరనున్నాయి.

శైవక్షేత్రాలకు..

రాష్ట్రంలో మూడు ప్రముఖ శైవక్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలంలకు నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి నవంబర్ 9, 16, 23 తేదీల్లో రాత్రి 8 గంటలకు ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. బస్సు చార్జి రూ.1800లుగా నిర్ణయించారు. కాగా నవంబర్ మాసంలో ప్రతిరోజూ నెల్లూరు నుంచి శ్రీశైలం వెళ్లేందుకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశారు. ఇది కేవలం వెళ్లేందుకు మాత్రమే రూ.670లుగా నిర్ణయించారు.

శైవదర్శనాలు..

శైవ దర్శనాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ప్రాంతాలకు(ప్రతి ఆదివారం) నవంబర్ 10, 17, 24వ తేదీల్లో ఉదయం 9 గంటలకు నెల్లూరు నుంచి బయలుదేరుతాయి. సూపర్ లగ్జరీ బస్సుకు రూ.2500 రాను పోను ప్రత్యేక ప్యాకేజీ అందుబాటులో ఉంచారు. ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిల్, పసుపు, కుంకుమ, బిస్కెట్ ప్యాకెట్ ఇవ్వనున్నారు. ప్రయాణికులు టికెట్లను ప్రధాన బస్టాండ్‌లో లేదా ఆర్టీసీ ఆథరైజ్డ్ ఏజెంట్ వద్ద నుంచి పొందవచ్చు. ఆన్‌లైన్ ద్వారా 46480 నంబర్‌ను సంప్రదించి రిజర్వేషన్ పొందవచ్చు.



ఇటీవల కరపత్రాలను విడుదల చేసిన ఆర్టీసీ అధికారులు

అరుణాచలానికి..

ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన అరుణాచలానికి నెల్లూరు డిపో 1 నుంచి నవంబర్ 9, 10, 14, 17, 24లతో పాటు డిసెంబర్ 1వ తేదీల్లో ఉదయం 9 గంటలకు నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి రాత్రికి నెల్లూరుకు చేరుకుంటాయి. సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.1200లుగా నిర్ణయించారు.

మైనారిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆవాజ్ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట) : రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని కలెక్టర్ ఆనంద్‌కు ఆయన కార్యాలయంలో ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు మొహమ్మద్ సర్దార్ అహ్మద్, పఠాన్ షబ్బీర్, మధు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

- వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజన కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.
- ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో అంబేడ్కర్ నగర్, ప్రశాంతినగర్, నీలగిరి సంఘం, కేవీఆర్ పెట్రోల్‌బంక్, జిల్లా పోలీస్ కార్యాలయం, జేసీ బంగ్లా, రెయిన్ స్క్వేర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.
- శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో యనమలవారిపాళెం, స్టౌన్‌హౌస్‌పేట, మూడో మైలు, ప్రశాంతినగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, జాకీర్‌హుస్సేన్ నగర్, కిసాన్ నగర్, బంగ్లాతోట పరిసర ప్రాంతాల్లో అంతరాయాలు ఉంటాయి.
- నవాబుపేట రైతుబజారు సబ్‌స్టేషన్ పరిధిలో పప్పులవీధి, లక్ష్మీపురం, సాలెవీధి, తడికల బజారు సెంటర్, అరుంధతీపాళెం పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.
- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మనుమసిద్ధి నగర్, గుప్తా పార్కు, అగ్నిపేట, ఈద్గామిట్ట, పుత్తా ఎస్టేట్, వాకర్స్‌రోడ్డు, పొర్లుకట్ట పరిసర ప్రాంతాల్లో అంతరాయాలు ఉంటాయి.

పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించాలి

- మంత్రి నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, కుళాయి పన్నుల వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగ సమావేశ మందిరంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి పలు అంశాలపై మున్సిపల్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు గానూ రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొండి బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. నెల్లూరు రూరల్, సిటీ నియోజకవర్గాల పరిధిలో అన్ని గుంతలకు త్వరగా మరమ్మతులను పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో అనధికారికంగా ఏడు వేలకుపైగా కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, వీటిపై చర్యలు చేపట్టాలని సూచించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అదనపు, డిప్యూటీ కమిషనర్లు నందన్, చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం



మూలాపేట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రత్యేక పుష్పాలంకరణ

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో శుక్రవారం కోటి సోమవారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పుష్పాలంకరణ, రాత్రి ప్రాకారోత్సవం వేడుకగా, నేత్రపర్వంగా సాగింది. భక్తులు విశేషంగా తరలివచ్చి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు

నెల్లూరు సిటీ: పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులను శుక్రవారం చేపట్టారు. రామ్‌నగర్‌లో మెంటా మధు దాదాపు 62 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని తన ఇంట్లో నిల్వ చేశారు. దీని విలువ దాదాపు రూ.95,825 ఉంటుందని అధికారులు వెల్లడించారు.

- రామ్‌నగర్‌లో రాచపూరి సంపూర్ణ 42 పీడీఎస్ బస్తాలను అక్రమంగా నిల్వ చేయడాన్ని గుర్తించారు. సుమారు రూ.62,335 విలువజేసే బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా రామారావు

నెల్లూరు సిటీ : మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా చెంచురామారావును నియమిస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన వీఆర్‌లో ఉన్నారు. గతంలో నెల్లూరు బాలాజీనగర్‌తో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లలో సీఐగా పనిచేశారు.

11న డయల్ యువర్ డీఎం-2

నెల్లూరు సిటీ : ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనల కోసం నెల్లూరు డిపో-2 పరిధిలో డయల్ యువర్ డీఎం-2ను ఈనెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25642 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బెల్టు దుకాణాలపై దాడులు

నెల్లూరు సిటీ : నగరంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు వారు తెలిపారు.

భగత్‌సింగ్ కాలనీలో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

నెల్లూరు సిటీ: నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో కార్డన్ సెర్చ్‌ను నవాబుపేట పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో స్పెషల్ పార్టీలతో కలిసి సుమారు 35 మందితో ఆపరేషన్‌ను జరిపారు. సుమారు 400 ఇళ్లలో తనిఖీలు చేపట్టగా, సరైన పత్రాల్లేకపోవడంతో 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, ఎస్సై రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న సుందరరామరాజు

నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుందరరామరాజు ఆరోపించారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఏఐకేఎస్ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్రంలో రైతుల పరిస్థితి నానాటికీ దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమం కోసం ఏఐకేఎస్ జాతీయ మహాసభలను బిహార్ రాజధాని పట్నాలో డిసెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లంకా కృష్ణమూర్తి, ఎమ్మెస్ రాజు, జయవర్ధన్, హిమబిందు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వరునికి అభిషేక మహోత్సవం



నెల్లూరు(బృందావనం) : కార్తీక మాసం సందర్భంగా బాలాజీనగర్‌లోని సీతారామ మందిరంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామికి శుక్రవార అభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో గోవింద నామస్మరణలు, భక్తి సంకీర్తనలు, వేదమంత్రోచ్చారణలతో నేత్రపర్వంగా నిర్వహించిన అభిషేక మహోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. వైఖానస ఆగమ పండితుడు బృందావనం శ్రీనివాస దీక్షితులు పాలు, పెరుగు, నారికేళ జలం, తేనెతో పాటు పసుపు, చందనంతో స్వామివారిని నయనానందకరంగా అభిషేకించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ భక్తులకు లడ్డూప్రసాదంతో పాటు మహిళా భక్తుల్లో ఆరుగురిని లాటరీ ద్వారా ఎంపిక చేసి అమ్మవారి పట్టువస్త్రాలను అందజేశామన్నారు. కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, నిర్వాహకులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, సమితి సభ్యులు రామాంజనేయులురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దినేష్‌రెడ్డి, రఘుపతి నాయుడు, జగన్‌రెడ్డి, కేఎల్ నారాయణ పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి



కమిషనర్ సూర్యతేజకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో పలు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కమిషనర్ సూర్యతేజను కలిసి విన్నవించారు. ఆయన పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో ఎన్‌ఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జాఫర్‌సాహెబ్, సర్వేపల్లి కెనాల్స్ రివిట్‌మెంట్ వాల్ ఎత్తు తక్కువగా ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడ గోడ ఎత్తు పెంచడం లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.100 కోట్లతో జాఫర్‌సాహెబ్ కెనాల్ రివిట్‌మెంట్ వాల్‌తో పాటు వాకింగ్ ట్రాక్, గ్రీనరీ కోసం ఏర్పాట్లు చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం అక్రమంగా కొన్ని దుకాణాలను ఏర్పాటు చేయడంతో స్థానికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలియజేశారు. ప్రణాళిక ప్రకారం అక్కడ వాకింగ్ ట్రాక్, గ్రీనరీని అభివృద్ధి చేయాలని కోరారు. తప్పని పరిస్థితుల్లో వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేస్తే అక్కడ నివాసాలు, షాపులను ఖాళీ చేసిన పేదలకు ఇవ్వాలని కోరారు. హైవే నుంచి చిల్డ్రన్స్‌పార్కు గుండా భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించడం ద్వారా రోడ్డు గుంతలమయంగా మారుతోందన్నారు. రామలింగాపురం ఫ్లైఓవర్ జంక్షన్ వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రీనరీ పెంపొందించాలని కోరారు. డివిజన్‌లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలపై స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సిల్లో వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ ఎంపికకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ కోరగా, లెటర్ ఫార్మేట్లో అందజేయాలని కమిషనర్ తెలియజేశారు. ఆయన వెంట పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్లు ఊటుకూరు నాగార్జున, నీలి రాఘవరావు, షేక్ కరిముల్లా, కామాక్షిదేవి, విజయలక్ష్మి, సీనియర్ నాయకులు హుస్సేనీ, సిద్ధిక్, నేతాజీ సుబ్బారెడ్డి, అలీం, సందాని, యస్దాని తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ మార్చ్ జయప్రదానికి పిలుపు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో నవంబర్ 28వ తేదీ తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయాలని కోరుతూ విద్యార్థి సంఘం నేతలు శుక్రవారం నెల్లూరులోని ప్రభుత్వ బాలుర వసతి గృహ ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, సుబ్బరాయుడు, జిల్లా కన్వీనర్ తిరుపతి, శివప్రసాద్, మస్తాన్, మణికంఠ, రాము పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై పరిశీలన



నెల్లూరు(బారకాసు) : హైవే నుంచి నగరంలోకి ప్రవేశించే చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు జంక్షన్ వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టేందుకు నగరపాలక అదనపు కమిషనర్ నందన్ శుక్రవారం పరిశీలించారు. ట్రాఫిక్, రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు, సిబ్బందితో సెంట్రల్ లైటింగ్, సూచిక బోర్డులు, ప్రమాద ప్రాంతాలు, స్పీడ్ బ్రేకర్ల గురించి ఆరాతీశారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు నెల్లూరీయులు



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు నెల్లూరు లిటిల్ ఏంజిల్స్ స్కూల్ విద్యార్థులు అర్హత సాధించారు. ఇటీవల పార్వతీపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో చాట్ల అక్షయ్ మహదేవ్ ప్రథమ స్థానంతో బంగారు పతకాన్ని సాధించగా, కాంపౌండ్ విభాగంలో చాట్ల అశ్విన్ మహదేవ్ తృతీయ స్థానంతో బ్రాంజ్ మెడల్‌ను సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 18 నుంచి గుజరాత్ నడియాడ్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రం తరఫున వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ క్రమంలో వీరిని మంత్రి నారాయణ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు.

శాస్త్రీయ నృత్య పోటీలు రేపు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పుర మందిరంలో సినీ, లలిత, సంగీత, శాస్త్రీయ, వెస్ట్రన్ డ్యాన్స్ పోటీలను ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కేతా సుబ్బారావు తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిరంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేయనున్నామన్నారు. ఆసక్తి గలవారు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే 100 మందితో ప్రత్యేక నృత్య ప్రదర్శనలు, సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించనున్నట్లు వివరించారు. సమావేశంలో డ్యాన్స్ మాస్టర్ ఎన్వీ రమణయ్య, ఎస్.రఘురామిరెడ్డి, అమానుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



దాత కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేత

నెల్లూరు(అర్బన్) : స్థానిక ఎన్టీఆర్ నగర్ చెరుకుతోట ప్రాంతానికి చెందిన బి.మస్తాన్‌రెడ్డి (84) వయోభారంతో శుక్రవారం ఇంటి వద్ద మృతిచెందారు. మృతుని కుటుంబ సభ్యుల అంగీకారంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ జి.సునీల్ మస్తాన్‌రెడ్డి కంటి కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన మస్తాన్‌రెడ్డి కుటుంబసభ్యులను నేత్రదాన మోటివేటర్లు సునీల్‌బాబు, మాల్యాద్రి రమేష్‌లు అభినందించి సర్టిఫికెట్‌ను అందించారు. మరణానంతరం నేత్రదానం చేయదల్చిన వారు సునీల్ 99595 89321, బాలాజీ 93471 11033 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

నెల్లూరు(సెంట్రల్) : రబీ సీజన్ ప్రారంభం కావడంతో ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలని వ్యవసాయశాఖ ఏడీ నర్సోజీ, మార్క్‌ఫెడ్ డీఎం ప్రదీప్‌కుమార్ అన్నారు. నెల్లూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎరువుల తయారీదారులు, హోల్‌సేల్ డీలర్స్‌తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియాతో పాటు ఇతర ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న సొసైటీలకు ఎరువులు సరఫరా చేసే విధంగా చూడాలన్నారు.